క్లుప్తంగా

ఉన్నతాధికారులను కలిసిన ఎమ్మెల్సీ ఇక్బాల్

కర్నూలు: జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, కలెక్టర్ డాక్టర్ సృజనను మంగళవారం ఎమ్మెల్సీ, విశ్రాంత రాయలసీమ ఐజీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ సృజన తండ్రి కడప జిల్లా ఆర్డీఓగా పనిచేస్తున్న సమయంలో తాను అక్కడ డీఎస్పీగా విధులు నిర్వహించినట్లు గుర్తు చేసుకున్నారు. కర్నూలు జిల్లా అభివృద్ధికి కలెక్టర్, ఎస్పీ కలిసికట్టుగా కృషి చేయడం శుభపరిణామమని కొనియాడారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమించాలి



మానవ హారం నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమించి ప్రధాని మోదీని గద్దె దింపాల్సిన అవసరముందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి సూచించారు. మోదీని గద్దె దింపుదాం..దేశాన్ని కాపాడుకుందాం నినాదంతో కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.ప్రభాకరరెడ్డి హాజరై మాట్లాడుతూ దేశంలోని సంపదను మోదీ కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌కు ధారాదత్తం చేస్తున్నారని, ఫలితంగా దేశంలోని కార్మికులు ఉపాధిని కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, డీజిల్, పెట్రోల్ రేట్లు పెరిగిపోతుండడంతో వాహన రంగం కుదేలవుతోందన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కోల ప్రతాప్, స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ, చీఫ్ కోచ్ శ్రీనివాసులు

కర్నూలు (న్యూసిటీ): జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ, కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కోల ప్రతాప్, చీఫ్ కోచ్ శ్రీనివాసులు సర్టిఫికెట్లతో అభినందించారు. ఈ సందర్భంగా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కోల ప్రతాప్ మాట్లాడుతూ సబ్ జూనియర్ కాడేట్ జూనియర్ కటాస్, కుమిటే విభాగాల్లో 12 ఏళ్ల విభాగంలో డి.మేఘనాథ్ రెడ్డి, 9 ఏళ్ల బాలుర విభాగంలో హేమల్ కుమార్‌రెడ్డి, స్వాతిక్, మెదస్వి, ఉమేరా దిల్షాద్, మేఘన, ఇస్మాయిల్, రాజీవ్ మనోహర్, సచిన్, జాన్వి, చైతన్య, హర్షద్, చక్రి, జస్వంత్, అర్జున్, కీర్తన జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. వీరు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు హర్యానా రాష్ట్రం కురుక్షేత్రంలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని శంకర్‌నగర్‌కు చెందిన మునిస్వామి ఏపీ 21 బీడీ 2970 స్కూటీపై మంగళవారం అక్రమంగా కర్ణాటక మద్యాన్ని రారావి నుంచి తరలిస్తుండగా బసాపురం ఎల్లెల్సీ కాలువ వద్ద పట్టుకున్నట్లు ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. సదరు వ్యక్తి వద్ద నుంచి 90 ఎంఎల్ పరిణామం గల ఒరిజినల్ ఛాయిస్ 480 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అస్వస్థతకు గురై వీఆర్‌ఏ మృతి

పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో వీఆర్‌ఏగా పని చేస్తున్న గోవిందు (51) మంగళవారం అస్వస్థకు గురై చనిపోయాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం కర్నూలులోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేసేందుకు సోమవారం తోటి వీఆర్‌ఏలతో కలసి వెళ్లాడు. రాత్రి అక్కడే సీఐటీయూ కార్యాలయంలో బస చేశాడు. మంగళవారం ఉదయం ధర్నాకు వెళ్లాల్సిఉండగా ఆరోగ్యం బాగలేకపోవడంతో సొంత గ్రామానికి వెళ్లాలని నిశ్చయించుకుని బస్టాండ్‌కు వచ్చి ఎమ్మిగనూరు బస్సు ఎక్కాడు. బస్సు కే.నాగలాపురం చేరుకోగానే ఫిట్స్ వచ్చి కింద పడిపోయాడు. తోటి ప్రయాణికులు ఆయన చేతిలో తాళాలు పెట్టి చూశారు. వెంటనే అంబులెన్స్‌ను రప్పించి అందులోకి ఎక్కించారు. కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతిచెందాడు. ఆయన దగ్గరున్న ఫోన్‌బుక్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు కోడుమూరు వెళ్లి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతుడు గోవిందుకు భార్య కృష్ణమ్మ, కుమారుడు విష్ణు ఉన్నారు.

రాజధానికి రైలేదీ?

- కర్నూలు–మచిలీపట్నం ప్రత్యేక రైలు రద్దు
- గడువు ముగిసి పది రోజులైనా పొడిగించని ద.మ.రైల్వే
- మంత్రాలయం నుంచి గద్వాల, కర్నూలు మీదుగా నడిపేందుకు సర్వే
- ఆచరణలోకి రాని కార్యాచరణ
- తొలి రాజధాని నుంచి ప్రస్తుత రాజధానికి వెళ్లేందుకు తప్పని ప్రయాణ కష్టాలు
- బస్సుల్లో తడిసి మోపెడవుతున్న చార్జీ



విజయవాడ రైల్వే స్టేషన్

కర్నూలు(రాజ్‌విహార్): రాజధాని అమరావతికి రైలు సౌకర్యం కరువైంది. విజయవాడ ప్రాంతంలో రాజధాని ఉండడంతో ఏ చిన్న అవసరం వచ్చినా ప్రయాణికులు పరుగుదీయాల్సి వస్తోంది. ఆర్టీసీ బస్సులు తగినన్ని ఉన్నా.. రైళ్లు మాత్రం లేవు. ఉన్న రైళ్లను వివిధ రూపాల్లో నడిపిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఇటీవల ఆ సర్వీసులను రద్దీ చేశారు. దీంతో రోడ్డు మార్గం తప్పడం లేదు. వివిధ పనుల కోసం అమరావతి, విజయవాడ వెళ్లే ఉద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రుడు, వ్యాపారులు, రాజకీయ నాయకులు, సమాన్య ప్రజలు ప్రయాణ కష్టాలు ఎదుర్కొంటున్నారు. సుమారు 350 కిలో మీటర్ల దూరం, నల్లమల అడవులు, ఘట్ రోడ్డులో బస్సులు కుదుపులతో ప్రయాణించాలంటే వెళ్లి వచ్చేలోపు శారీరకంగా బాగా అలసట గురవుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

ఇలా నడిపి.. అలా ఎత్తేశారు

రాజధాని అమరావతిలో ఏర్పాటు చేశాక విజయవాడ వైపు వెళ్లే వారి సంఖ్య పెరిగింది. దీంతో ప్రయాణికుల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు విజయవాడకు నేరుగా కాకుండా కర్నూలు నుంచి కాకినాడకు 2018 డిసెంబరు 20 నుంచి ఆరు నెలల పాటు నడిపారు. ఆ రైలును రద్దు చేశాక మళ్లీ వస్తున్న విన్నపాల మేరకు ప్రభుత్వం 2022 నుంచి కర్నూలు – మచిలీపట్నం మధ్య నడిపేందుకు చర్యలు చేపట్టింది. ముందుగా వారంలో మూడు రోజుల చొప్పున మూడు నెలల షెడ్యూల్ ఇచ్చి.. ఆ తరువాత పొడగిస్తూ వచ్చింది. అయితే అలా పొడిగిస్తూ ఏడాది పాటు రైలు నడిపిన రైల్వే శాఖ అధికారులు జూన్ 30తో గడువు ముగిశాక తిరిగి పునరుద్ధరించలేదు. అయితే పలు డిమాండ్ల కారణంగా ఈ రైలును కర్నూలు నంచి కాకుండా తెలంగాణలోని గద్వాల, రాయచూరు, మంత్రాలయం వరకు పొడిగించి నడిపేందుకు సర్వే చేపట్టారు. అయినా కార్యాచరణ అమల్లోకి రాలేదు.

తొలి రాజధాని అయినా..

రాష్ట్ర తొలి రాజధాని, రాయలసీమ ముఖద్వారం కర్నూలు నుంచి ప్రస్తుత రాజధానికి నేరుగా రెగ్యులర్ రైళ్లు కరువయ్యాయి. కర్నూలు నుంచి విజయవాడకు నేరుగా ఒక్క రైలు కూడా లేదు. ఉన్న రెండు ప్యాసింజరు రైళ్లు గుంటూరు వరకు మాత్రమే నడుస్తున్నాయి. డోన్ మీదుగా హౌరా వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్‌తో పాటు, యశ్వంత్‌పూర్ నుంచి భువనేశ్వర్‌కు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడ మీదుగా వెళ్తాయి. మరో రెండు రైళ్లు వారానికి ఒకరోజు చొప్పున రాకపోకలు సాగిస్తున్నాయి. రైలు ద్వారా బెజవాడ వెళ్లాలంటే డోన్ లేదా నంద్యాలకు చేరుకోవాల్సిందే. దీని కోసం మరో రూ.100కి పైగా ఆర్టీసీ బస్సుల్లో చార్జీ చెల్లించుకోవాలి. హైదరాబాదు – కర్నూలు మధ్య ప్రయాణకష్టాలు తొలగించాలని సుమారు 20 ఏళ్లు పోరాడితే 2013 జూన్ 25 నుంచి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రవేశపెట్టారు. ఇప్పుడు రాజధాని ప్రాంతం గుంటూరు, విజయవాడకు వెళ్లాలంటే మళ్లీ ప్రయాణ కష్టాలు ఆరంభమయ్యాయి.

ఇంటర్ సిటీ రైలు నడపాలి



కర్నూలు నుంచి విజయవాడకు ఇంటర్ సిటీ రైలు నడపాలి. ప్రతి రోజు రాత్రి బయలుదేరి మరుసటి రోజు ఉదయాన్నే అక్కడ చేరుకునేలా రవాణా సౌకర్యం కల్పించాలి. దీంతో పగలు పనులు చూసుకొని, తిరిగి రాత్రి కర్నూలుకు చేరుకునేలా రైలు ఉంటే ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– చాంద్ బాషా, కర్నూలు

ప్రయాణం కష్టంగా ఉంది



నేను వివిధ పనుల రీత్యా నెలకు రెండు, మూడు సార్లు విజయవాడకు వెళ్లి రావాల్సి ఉంటుంది. ఇది వరకు ఉన్న రైలు రద్దు చేయడంతో బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఘాట్ రోడ్డు, అసౌకర్యాల మధ్య ప్రయాణం ఉంటుంది. ప్రజల అవసరాల మేరకు రోజువారిగా రైళ్లు నడపాలి.

– శ్రీనివాస్, ప్రైవేటు ఉద్యోగి

ప్రత్యేకంలో చార్జీల బాదుడు

కర్నూలు నుంచి మచిలీట్నానికి వారంలో మూడు రోజులు మాత్రమే నడిచే ప్రత్యేక రైలు ఆది, బుధ, శుక్రవారాలు వెళ్తుంది. అక్కడి నుంచి సోమ, గురు, శనివారాల్లో తిరిగి కర్నూలుకు వస్తుంది తప్ప రోజువారి రైళ్లు లేవు. ప్రత్యేక రైళ్లు కావడంతో ఇందులో చార్జీలూ అధికంగా ఉంటాయి. సాధారణ చార్జీలతో పోల్చితే సీటింగ్‌లో రూ.60 వరకు, స్లీపర్ రిజర్వేషన్‌లో రూ.150 వరకు అదనంగా ఉంటున్నాయి. దీంతో ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్న ప్రయాణికులకు అక్కడా చార్జీలు భారంగా మారాయి. ప్రత్యేక రైలుకు బదులు రోజువారిగా సాధారణ రైళ్లు నడపాలని ప్రయాణికులు విన్నవిస్తున్నారు.

బీఎల్‌ఓ సస్పెన్షన్

కర్నూలు(టౌన్): అప్పగించిన పనులు సక్రమంగా నిర్వర్తించకుండా నిర్లక్ష్యం ప్రదర్శించినందుకు సచివాలయ ఉద్యోగిపై వేటు పడింది. నగరపాలక పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలో ముమ్మరంగా ఇంటింటి ఓటర్ల సర్వే జరుగుతోంది. 15వ వార్డులోని 109వ పోలింగ్ స్టేషన్ బూత్ లెవల్ ఆఫీసర్ ఎండీ అబ్దుల్ బాసిత్ (వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శి) విధులకు సక్రమంగా రాకపోవడం, ఆలస్యంగా రావడం, నిర్లక్ష్యపు సమాధానం చెప్పడం తదితర కారణాలతో అతడిని మంగళవారం సాయంత్రం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

కర్నూలు(రాజ్‌విహార్): మండల పరిధిలోని కొత్తకోట నుంచి కర్నూలు నగరానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో కర్నూలు–2 డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తకోట రూట్‌లో బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అనంతరం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అమర్, సాయి, ఉదయ్ పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

కర్నూలు (టౌన్): ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు, వైద్య అధ్యాపకులు సమయ పాలన పాటించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్. వి. వెంకటరంగారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వైద్యులు, పలు విభాగాల వైద్య అధ్యాపకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రతిరోజు ఆసుపత్రిలోని ఓపీ, ఐపీ విభాగాల్లోని వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని హెచ్ఓడీలను ఆదేశించారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



వ్యాస రచన పోటీల విజేతలతో డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి, తదితరులు

కర్నూలు సిటీ: జపాన్ దేశంలో హిరోషిమా–నాగసాకిలో జరిగిన దుర్ఘటనపై ఏటా ఆగస్టు 6న హిరోషిమా–నాగసాకి డే సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఏపీ మోడల్ స్కూల్(పెద్దపాడు)లో విద్యార్థులకు హిరోషిమా–నాగసాకి ఘటనపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ సమాజంలో అందరు సమానమనే భావనతో బతికితే గొప్ప సమాజం తయారవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ రంగమ్మ, ఏపీ మోడల్ స్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జహీరుద్దీన్ అలీఖాన్ మృతి జర్నలిజానికి తీరని లోటు

కర్నూలు (న్యూసిటీ): ది సియాసత్ డైలీ మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ మృతి జర్నలిజానికి తీరని లోటని డాక్టర్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.ఫజులుర్ రహమాన్, రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు మంగళవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ప్రజా గాయకుడు గద్దర్ అంతిమ యాత్రలో పాల్గొన్న జహీరుద్దీన్ గుండెపోటుతో మరణించడం బాధాకరమన్నారు. సమాజంలోని అనేక సామాజిక సమస్యలను జహీరుద్దీన్ తన కలం ద్వారా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారని, ఆయన మృతి ఉర్దూ బాషాభిమానులకు, ఉర్దూ జర్నలిజానికి తీరని లోటని పేర్కొన్నారు.

రేషన్ కిట్లు సక్రమంగా అందేలా చూడండి

- ఐసీడీఎస్ అధికారులను ఆదేశించిన జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): టేక్ హోం రేషన కిట్లను బాలింతలు, గర్భిణులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆమె ఐసీడీఎస్ అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించి పౌష్టికాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో వైద్యులు రక్తహీనత నిర్ధారణ పరీక్షలను సక్రమంగా చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. రక్తహీనత నిర్ధారణ అయిన వారికి పోలిక్ యాసిడ్ మాత్రలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెంటర్లలో చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు మహిళా పోలీసులు వస్తున్నారా? లేదా అని ఆరా తీశారు. టాయ్‌లెట్లు శుభ్రంగా ఉన్నాయా లేదా అన్న విషయాలను మహిళా పోలీసులు యాప్‌లో నమోదు చేయాల్సి ఉందని, వారు ఆ పనిచేసేలా చూడాలని సూచించారు. అంగన్‌వాడీలకు సకాలంలో బియ్యం, కందిపప్పు, నూనె, తదితర సరుకులను సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): ప్రధాన మంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మ నిర్బర్ నిధి కింద మంజూరైన రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలని నగర పాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ మహిళలకు సూచించారు. మంగళవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, వీధి వ్యాపారులకు ఆత్మనిర్బర్ నిధుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో ఇప్పటి వరకు 12,730 మందికి గానూ 9,118 మంది వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. మొదటి విడతలో రుణం తీసుకొని సక్రమంగా చెల్లించిన వారికి రెండో విడత కింద రూ.20 వేలు, మూడో విడత కింద రూ.50 వేలు రుణం మంజూరవుతుందన్నారు. సక్రమంగా చెల్లించే వారికి ప్రభుత్వం 7 శాతం వడ్డీ రాయితీ ఇస్తుందన్నారు. ప్రతి ఒక్క వీధి వ్యాపారి డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ నాగశివలీల, ఎల్‌డీఎం రామచంద్రరావు, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, జీవనోపాధుల స్పెషలిస్టు జిలానీబాషా, సీఎంఎం మురళీ పాల్గొన్నారు.

వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలి



కలెక్టరేట్ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): గ్రామ సేవకులుగా పనిచేసే వారికి వారసత్వంగా ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ధర్నా చౌక్‌లో గ్రామ సేవకులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం మూడో రోజు దీక్షలను కొనసాగించారు. అనంతరం కలెక్టరేట్ ముట్టడికి యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో మెయిన్ గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ గ్రామ సేవకులకు పే స్కేల్ అమలు చేయాలన్నారు. తెలంగాణలో మాదిరిగా ప్రభుత్వ ఉద్యోలుగా గుర్తించాలన్నారు. అర్హత ఉన్న వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు అంజి, నాయకులు ఈరన్న, శ్రీనివాసులు, మల్లయ్య, ప్రహ్లాద పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలకు సిద్ధం కండి



మాట్లాడుతున్న కర్నూలు ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): పంట కోత ప్రయోగాలను పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని ఏఈఓలు, ఎంపీఈఓలు, ఆర్‌బీకే ఇన్‌చార్జులకు కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో కర్నూలు, కల్లూరు మండలాల ఏఈఓలు, ఆర్‌బీకే ఇన్‌చార్జులకు పంట కోత ప్రయోగాల నిర్వహణపై అవగాహన కల్పించారు. జిల్లాలోని 1,305 సాధారణ పంట కోత ప్రయోగాల్లో సగం ఏఈఓలు, ఆర్‌బీకే ఇన్‌చార్జులు చేయాల్సి ఉందన్నారు. గ్రామం యూనిట్‌గా ఖరీఫ్‌లో వరి, రబీలో శనగకు దిగుబడి ఆధారిత బీమా ఉందని, మండలం యూనిట్‌గా మొక్కజొన్న, కంది, జొన్న, మిర్చి, ఆముదం, జిల్లా యూనిట్‌గా సజ్జ, కొర్ర పంటలకు దిగుబడి ఆధారిత బీమా సదుపాయం ఉందని తెలిపారు. డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ భాస్కర్ మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలకు ఎంపిక చేసిన గ్రామాలు, సర్వే నంబర్లు, రైతుల వివరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఎన్‌సీఐపీ, ఏపీసీసీఈ యాప్‌ల్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు, కల్లూరు మండల వ్యవసాయ అధికారులు విశ్వనాథ్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

14న 'అఖండ భారత సంకల్పన దివస్' అవగాహన సదస్సు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్: బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఈనెల 14న 'అఖండ భారత సంకల్పన దివస్' అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కుమ్మరి వీధిలోని శివాలయంలో ఏర్పాటు చేసిన బజరంగ్ దళ్ నగర విస్తృత స్థాయి సమావేశంలో అవగాహస సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రజలను జాగృతం చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. వీహెచ్‌పీ నగర అధ్యక్షులు మద్దిలేటి మాట్లాడుతూ కర్నూలు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సదస్సు జరుగుతుందన్నారు. వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ కార్యకర్తలు, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజేష్, సాయిరాం, వెంకటేశ్వర్లు, భగీరథ, జయప్రకాష్, నారాయణ, శివకుమార్, రక్షిత్, రాజు, యోగి తదితరులు పాల్గొన్నారు.

ఖానా ఖజానాలో షాపుల కేటాయింపు



షాపులను కేటాయిస్తున్న నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): స్థానిక బిర్లాగేట్ సర్కిల్ వద్ద ఈ నెలాఖరున ప్రారంభించనున్న ఖానా ఖాజనా (ఈట్ స్ట్రీట్)లో షాపులు కేటాయించారు. నగరపాలక కార్యాలయంలోని తన చాంబర్‌లో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బిర్యానీ పాయింట్, కాఫీ, టీ యూనిట్, జూస్ సెంటర్ యూనిట్, వెగ్గీస్ స్నాక్స్ యూనిట్, చాట్‌బండార్, ఐస్ పార్లర్, పిజ్జా బర్గర్ షాపులకు లాటరీ పద్ధతిన ఎంపికైన వారికి దుకాణాలను కేటాయించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ ఖానా ఖాజనా ప్రాంతం నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తినుబండారాల నుంచి ఐస్ పార్లర్ వరకు నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర రావు పాల్గొన్నారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

- మరికొందరు పరార్
- రూ.1,04,600 నగదు స్వాధీనం

ఆదోనిరూరల్: మండలంలోని కడితోట గ్రామ సమీపంలోని కమలమ్మ వంక వద్ద మంగళవారం పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య తెలిపారు. ఆదోని పట్టణం హనుమాన్‌నగర్‌కు చెందిన బోయ రవి, ఎల్‌ఐజీ కాలనీకి చెందిన కురువ నాగరాజు, బసాపురానికి చెందిన గంగన్న, నిజాముద్దీన్ కాలనీకి చెందిన మహ్మద్‌గౌస్, ఇమ్రాన్, తాహెర్, అమరావతినగర్‌కు చెందిన అల్తాఫ్, రమేష్, గోకారిజెండాకు చెందిన తాహెర్ పేకాట ఆడుతుండగా సిబ్బందితో దాడులు చేసి పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి 52 పేక ముక్కలు, రూ.1,04,600 నగదు, 10 బైకులు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పోలీసులను చూసి పరారైన హవన్నపేటకు చెందిన సర్దార్, నిజాముద్దీన్ కాలనీకి చెందిన షాబ్బా, షేక్షా, కార్వన్‌పేటకు చెందిన చాంద్, మౌలి, గడ్డం చాంద్, అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఎల్లప్ప, బొబ్బిలిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. త్వరలోనే వారిని పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తామన్నారు. దాడుల్లో పోలీసు సిబ్బంది కృష్ణమూర్తి, లక్ష్మినారాయణ, రాఘవేంద్ర, సుధాకర్‌లు ఉన్నారు.

'నా భూమి-నా దేశం' విజయవంతం చేయండి

కర్నూలు(టౌన్): 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సెట్కూరు ముఖ్య కార్య నిర్వహణాధికారి రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9 నుంచి 30వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద 75 దేశవాళీ మొక్కలు నాటాలన్నారు. 16 నుంచి 20వ తేదీ వరకు మున్సిపాల్టీలు, పట్టణాల్లో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు, యువకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సారా విక్రేత అరెస్ట్

వెల్దుర్తి: కోడుమూరు సెబ్ బృందం, స్థానిక పోలీసులు మంగళవారం జరిపిన దాడుల్లో రామళ్లకోట గ్రామ పరిసరాల్లో సారా తరలిస్తున్న కల్లూరు మండలం కొళ్లంపల్లి తండాకు చెందిన హనుమాన్ నాయక్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి 20 లీటర్ల నాటుసారా, ఎక్స్‌ఎల్ మోపెడ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని డోన్ కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించామన్నారు.

బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు ప్రయత్నించిన మహ్మద్

మంత్రాలయం రూరల్: ఆదోని పట్టణం ఖాజీపేటకు చెందిన యువకుడు మహ్మద్ మంత్రాలయంలో బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణం ఖాజీపేటకు చెందిన ఇతను హోటల్లో పనిచేసేవాడు. మద్యానికి బానిసయ్యాడు. ఏడాది క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. వీరికి ముగ్గురు సంతానం. దీంతో మానసికంగా కుంగిపోయాడు. రెండు రోజుల క్రితం మంత్రాలయానికి వచ్చి భిక్షాటన చేస్తున్నాడు. ఈ స్థితిలో బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అక్కడున్న వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్టేషన్‌కు తీసుకొచ్చి చికిత్స చేయించారు. యువకుడి తల్లిదండ్రులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.